క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ



టై, బెల్టులు అందిస్తున్న నాయకులు

ముస్తాబాద్: నామాపూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమురయ్య గురువారం పంపిణీ చేశారు. రాజిరెడ్డి, బాలు, దశరథం, నవీన్, వంశీ, కుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంలలో ఎస్సై మారుతి ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణపత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు.

మధుమేహంపై అవగాహన



సిరిసిల్లటౌన్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం డయాబెటీస్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మధుమేహ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు భిక్షమయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మధుమేహ వ్యాధిరాకుండా తీసుకోవాల్సిన ఆహార అలవా ట్ల గురించి వివరించారు. ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వరకు డయాబెటీస్ రన్ నిర్వహించారు. డయాబెటీస్ రన్‌లో 60 మంది వాకర్స్ పాల్గొనగా.. 50 మందికి ఉచిత డయాబెటీస్ పరీక్షలు చేశారు.

స్టడీ చైర్లు పంపిణీ



ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతిలోని 40 మంది విద్యార్థులకు కోడం విష్ణు గురువారం స్టడీ కుర్చీలు అందించారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అత్యధిక జీపీఏ సాధించాలి



కోనరావుపేట: పదో తరగతి విద్యార్థులు అత్యధిక జీపీఏ సాధించాలని మండల విద్యాధికారి మురళీనాయక్ కోరారు. ధర్మారం ఉన్నత పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్ జ్ఞాపకార్థం అదే గ్రామానికి చెందిన మంజుల అనే ఉపాధ్యాయురాలు పదో తరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన నలుగురు విద్యార్థులకు రూ.2500 చొప్పున ఆర్థిక సాయం అందించారు. పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ కోసం రూ.10వేలు అందజేశారు. ప్రభాకర్ కుమారుడు కిరణ్ పాఠశాల కోసం రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో 1994–95 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు ఆస్పత్రుల్లో వైద్యుల నియామకం

సిరిసిల్లటౌన్: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యులను నియమించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులు, ఎల్లారెడ్డిపేటలో పిల్లల వైద్యుడిని నియమించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పెంచలయ్య, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ ఆస్పత్రిలో పోస్టుమార్టం, స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ఆకట్టుకున్న బాలల చిత్ర ప్రదర్శన



సిరిసిల్లటౌన్: బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ఏర్పాటు చేసిన బాలల చిత్ర ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం సిరిసిల్లలోని సృజన్ పిల్లల ఆస్పత్రి ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రారంభించారు. డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు, డాక్టర్ సాత్విక్, కె.సృజన్ పాల్గొన్నారు.

కల్చరల్ మీట్.. సూపర్ హిట్

- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు
- అలరించిన నాటక ప్రదర్శనలు
- జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో ముగిసిన వేడుకలు



ట్రోఫీలు, ప్రశంసాపత్రాలతో వ్యవసాయ విద్యార్థులు

తంగళ్లపల్లి: విద్యార్థుల నృత్యాలు.. నాటకాలతో మూడు రోజులపాటు కొనసాగిన కల్చరల్ వేడుకలు గురువారం ముగిశాయి. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాలల కల్చరల్ మీట్ గురువారం ముగిసింది. మంగళవారం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, డీన్ ఆఫ్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీస్ డాక్టర్ జెల్ల సత్యనారయణ ప్రారంభించగా అట్టహాసంగా మొదలైన కార్యక్రమాలు మూడు రోజులపాటు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో విజయవంతంగా కొనసాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11 వ్యవసాయ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిలాబాద్, అశ్వారావుపేట, జగిత్యాల, పాలెం, తోమాల, వరంగల్, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలు, సంగారెడ్డి వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, సైఫాబాద్ సైన్స్ కళాశాల, రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

డిబేట్‌లో మొదటి స్థానం



రాష్ట్రస్థాయి కల్చరల్ మీట్‌లో భాగంగా నిర్వహించిన డిబేట్‌లో మొదటి స్థానంలో నిలిచిన. నన్ను ఎంతగానో ప్రోత్సహించిన డీన్ మేడమ్‌కు, ప్రొఫెసర్లకు ధన్యవాదాలు.

– ఆర్.నవ్య, జిల్లెల్ల వ్యవసాయ కళాశాల

ఆతిథ్యం బాగుంది



మాది తోమాల వ్యవసాయ కళాశాల. జిల్లెల్ల బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఆతిథ్యం బాగుంది. వసతి, భోజనం, పోటీల నిర్వహణ సూపర్‌గా ఉన్నాయి. వ్యాసరచనలో మొదటి స్థానంలో నిలిచాను.

– టి.అక్షయ్‌కుమార్, తోర్నాల వ్యవసాయ కళాశాల

సంతోషంగా ఉంది



పాటల పోటీలో రెండో బహుమతి గెలుపొందడం సంతోషంగా ఉంది. ఇలాంటి మీట్‌లతో విద్యార్థులకు విద్యతోపాటు విజ్ఞానం లభిస్తుంది. సొంతింటిలో ఉన్న ఫీలింగ్‌తో మూడు రోజులు అట్టే గడిచిపోయాయి.

– బి.సోను, తోర్నాల వ్యవసాయ కళాశాల

పోటీతత్వం పెరిగింది



దేశభక్తి గీతం రాసినందుకు నాకు మూడో బహుమతి లభించింది. మూడో స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మరింత కష్టపడి మొదటి స్థానం సాధిస్తా.. ఇలాంటి పోటీలు మరిన్ని జరిగితే పోటీతత్వం పెరుగుతుంది.

– మెట్టు గణేష్, జిల్లెల్ల వ్యవసాయ కళాశాల

అందరికీ ధన్యవాదాలు



మా బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కల్చరల్, లిటరరీ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉంది. అన్ని కళాశాలల నుంచి విచ్చేసి మా ఆతిథ్యం స్వీకరించి విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు.

– జి.శ్రీదేవి, అసోసియేట్ డీన్, బీజేఆర్ వ్యవసాయ కళాశాల

ఘనంగా సహకార వారోత్సవాలు



ఎల్లారెడ్డిపేటలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వేములవాడలో..

ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్: ప్రాథమిక సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా గురువారం కార్యాలయాల వద్ద జెండాలు ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేట, వేములవాడల్లో పీఏసీఎస్ చైర్మన్‌లు గుండారపు కృష్ణారెడ్డి, ఏనుగు తిరుపతిరెడ్డి జెండాలు ఆవిష్కరించారు. నాయకులు వరుస కృష్ణహరి, జంగిటి సత్తయ్య, నేవూరి వెంకటనరసింహారెడ్డి, కోనేటి ఎల్లయ్య, గంద్ర ప్రభాకర్ రావు, ల్యాగల సతీశ్ తదితరులు పాల్గొన్నారు

చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం తిమ్మాపూర్–నర్సింగపూర్ మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు తొలగించారు. 'మూలమలుపులు...మృత్యుదారులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు స్పందించారు. మండలంలోని ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులను గుర్తించి, వాటి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గిరిజనుల నడ్డి విరుస్తున్న సర్కారు

- బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

సిరిసిల్లటౌన్: కొడంగల్‌లో నియోజకవర్గంలో గిరిజనుల భూముల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్లుడు కోసం ఫార్మా ఇండస్ట్రీ పెట్టడాన్ని జిల్లా బంజార సంఘం ఖండించింది. ఈమేరకు సంఘం అధ్యక్షుడు గుగులోత్ సురేష్‌నాయక్ గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. గిరిజనులకు అక్కడ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా భూములను సస్యశ్యామలం చేస్తామని మాటిచ్చి ఆంధ్రాకు చెందిన సీఎం అల్లుడు బాగు కోసం గిరిజనుల భూముల్లో కంపెనీ పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలన్నారు. గిరిజనుల భూముల జోలికి వస్తే సహించబోమన్నారు. భూక్యా శంకర్, అజ్మీరా తిరుపతి, దేవీలాల్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నేతలు తీరు మార్చుకోవాలి'



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ నేతలు తీరు మార్చుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విషయాలు వక్రీకరించడం సరికాదన్నారు. నేతన్నల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. దిడ్డి రాజు, గుండ్లపెల్లి పూర్ణచందర్, సబ్బని హరీశ్, సందీప్, శ్రీనివాస్, మహ్మద్ సత్తార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. సుదర్శన హోమంతో విజయాలు సిద్ధిస్తాయన్నారు. అశ్విని హాస్పిటల్ జనరల్ సర్జన్ రవికిరణ్, ఎంపీడీ ఫిజీషియన్ అమిత దంపతులు, ఆలయ అధ్యక్షుడు గడ్డం జితేందర్, ఉపాధ్యక్షుడు గంట వెంకటేశ్‌గౌడ్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ నేవూరి మమతావెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండారి బాల్‌రెడ్డి, గోదా దీప్తి మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాల్లో సమయపాలన పాటించకుండా ఇసుక రవాణా చేస్తున్న ఓ టిప్పర్‌ను గురువారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృధ్వీధర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు తరలించాల్సిన ఇసుక టిప్పర్ రాత్రి తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బూర్గుపల్లి పరిసరాల్లో మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కోరెంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మీ కోసం ప్రోగ్రాం నిర్వహించి తిరిగి వస్తుండగా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్ కనిపించడంతో పట్టుకుని జిల్లా మైనింగ్ శాఖకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గంభీరావుపేట: ముస్తఫానగర్‌లో సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌కు మాజీ వార్డు సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు బండ రమేశ్ గురువారం వినతి పత్రం అందించారు. గ్రామంలో వీధిదీపాలు వెలగడం లేదని, డ్రైనేజీలు శుభ్రంగా లేవని తెలిపారు.

గంజాయి పట్టివేత

గంభీరావుపేట: పెద్దమ్మ స్టేజీ వద్ద పోలీసుల తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. గంజాయి విక్రయించడానికి వచ్చిన కరీంనగర్ జిల్లా గంగాధరకు చెందిన జంగిలి సందీప్, రహీంలను పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల నివాళి



కోనరావుపేట వేడుకల్లో చిన్నారులు

ఘనంగా బాలల దినోత్సవం

వేములవాడఅర్బన్/ వీర్నపల్లి/గంభీరావుపేట/ముస్తాబాద్/సిరిసిల్లటౌన్/ వేములవాడ అర్బన్/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/చందుర్తి: చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని చాచా నెహ్రూ పార్క్‌లోని నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ బాలల దినోత్సవం నిర్వహించారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



అగ్రహారం డిగ్రీ కాలేజీలో పుస్తక ప్రదర్శన



శ్రీచైతన్య స్కూల్‌లో వేడుకలు

అంగన్‌వాడీలో సీడీపీవో విచారణ



బొప్పాపూర్‌లో విచారణ చేపడుతున్న సీడీపీవో

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం సీడీపీవో ఉమారాణి విచారణ చేపట్టారు. ఇటీవల అంగన్‌వాడీ సెంటర్‌లో కోడిగుడ్లు పిల్లలకు ఇవ్వడం లేదని గ్రామస్తుడు బెస్త నరేశ్ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు ఫిర్యాదు చేయగా.. విచారణకు ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్‌కు జారీ చేసిన మెమోపై ఇచ్చిన సమాధానానికి అసంతృప్తితో వెళ్లిపోయారు. మరో మెమో జారీ చేస్తామని సీడీపీవో తెలిపారు.

మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మహాపాదయాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రాంచంద్రం అన్నారు. పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో మహాపాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. పాదయాత్ర 1000 కిలోమీటర్లు 16 జిల్లాలు 35 నియోజకవర్గాలు మీదుగా కొనసాగనుందని, రామగుండం నుంచి మంచిర్యాల వయా కొండగట్టు, ఫాజుల్ నగర్, వట్టెంల శాత్రాజుపల్లి నుంచి వేములవాడ మీదుగా హైదారాబాద్ వరకు కొనసాగుతుందని, మహాపాదయాత్రలో మాలలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, నాలుక సత్యం, చేర్ల ఆనంద్ కుమార్, కిషోర్, మంగ కిరణ్, తదితరులున్నారు.

మానీటిలో సూర్యాస్తమయం



బోయినపల్లి: మిడ్‌మానేరు నీటిపై గురువారం సాయంత్రం సూర్యాస్తమయం కనువిందు చేసింది. కొదురుపాక సమీపంలో సూర్యకిరణాలు మానీటిపై ప్రవహించడం ఆకట్టుకుంది.

సంక్షిప్త వార్తలు

శతాధిక వృద్ధురాలి మృతి



కోనరావుపేట: మండలంలోని కనగర్తికి చెందిన శతాధిక వృద్ధురాలు చిలుక లచ్చవ్వ గురువారం మృతిచెందింది. మృతురాలి భర్త చిలుక నర్సయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. మృతురాలికి ఐదుగురు కుమారులు కృష్ణహరి, శంకర్, ప్రభాకర్, రవి, రమేశ్, కూతుళ్లు దేవేంద్ర, సరోజన ఉన్నారు.

మల్లారెడ్డిపేటలో దుబ్బాక విద్యార్థులు



గంభీరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ దర్శినిలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు గురువారం మండలంలోని భీముని మల్లారెడ్డిపేట శ్రీవీరాంజనేయస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ ప్రత్యేకతలు, ప్రాముఖ్యతను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

దేశాయిపల్లి కల్వర్టు రోడ్డు మరమ్మతు చేయాలి

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్‌రోడ్డులో దేశాయిపల్లి కల్వర్టు పరిసరాల్లో పాడయిన రోడ్డును బాగుచేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్‌అండ్‌బీ డీఈఈ శాంతయ్యను గురువారం ఫోన్‌లో ఆదేశించారు. కల్వర్టు పరిసరాల్లో రోడ్డు పూర్తిగా పాడవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఈఈతో మాట్లాడారు. మండలంలోని 23 గ్రామాలకు చెందిన 152 మంది లబ్ధిదారులకు రూ.33.44 లక్షల మేర సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో అందించారు. జెడ్పీ సీఈవో వినోద్, ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, సెస్ డైరెక్టర్ సుధాకర్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట హైస్కూల్‌కు చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌కు సిరిసిల్లకు చెందిన ఎల్ఐసీ అధికారులు గురువారం సన్మానించారు. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణ, సిబ్బంది ప్రణీత్, శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం నారాయణ పాల్గొన్నారు.

16న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లటౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు బతుకమ్మ ఘాట్‌లో నిర్వహిస్తున్నారు. ఈమేరకు గురువారం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కనకం శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే పోటీలకు జిల్లా నుంచి 25 మంది క్రీడాకారులను పంపించనున్నట్లు పేర్కొన్నారు. అండర్ 8, 10, 12 వయస్సుల గల ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాలకు 93928 80231, 79014 64456లలో సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

వేములవాడఅర్బన్: ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రజలకు నేడు డయల్ యువర్ డీఎం ఉదయం 11 నుంచి 12 గంటల వర కు నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు ఉంటే 99592 25926, 73828 51729లో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన బత్తుల కృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ఇల్లంతకుంట: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కోరారు. ఇల్లంతకుంట మండలంలో గురువారం చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. పార్టీ కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, దళిత మోర్చా అధ్యక్షుడు కట్కూరు తిరుపతి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు


ఇల్లంతకుంట: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం కలిశారు. హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్యయాదవ్, కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి కలిశారు.

మాజీ ఎంపీపీ అనారోగ్యంతో మృతి



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లికి చెందిన మాజీ ఎంపీపీ మెర్గు రఘు(60) గురువారం మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో బుధవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	06	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	08	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	07	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	06	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	07	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	05	560
నందీశ్వర సూట్స్	06	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	05	448
పార్వతీపురం స్పెషల్	09	672
పార్వతీపురం సాధారణ	12	336

- వేములవాడ